సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 4 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.17,700
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,700 పలికాయి. మార్కెట్‌కు 748 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23
అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.13 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/23.4°

జిల్లా పరిధిలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'సూక్ష్మ' పరికరాలకు నమోదు చేసుకోండి



పెడపల్లిలో డ్రిప్పును పరిశీలిస్తున్న పీడీ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ రైతులకు సబ్సిడీపై అందించే సూక్ష్మ సేద్య పరికరాలకు అర్హులు నమోదు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సూచించారు. శనివారం ఆయన పుట్టపర్తి మండలం పెడపల్లి, రాచువారిపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల సబ్సిడీపై అందజేసిన సూక్ష్మ సేద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వం 30 వేల హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్లు కేటాయించిందన్నారు. డ్రిప్పు పరికరాలకు సంబంధించి 5 ఎకరాల్లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 10 ఎకరాల వరకూ ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో పరికరాలు అందించనున్నట్లు వెల్లడించారు. అలాగే స్ప్రింక్లర్లకు సంబంధించి 5 ఎకరాల వరకూ 55 శాతం, 12.5 ఎకరాల వరకూ 45 శాతం సబ్సిడీతో అందిస్తామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు పంపాలి



ఇన్‌స్పైర్ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఈఓ

పుట్టపర్తి: జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి 'ఇన్‌స్పైర్-మనక్' కోసం నామినేషన్లు పంపాలని డీఈఓ మీనాక్షి అన్నారు. శనివారం ఆమె కొత్తచెరువులోని తన కార్యాలయంలో ఏడీలు రామకృష్ణ, నాగరాజు తదితరులతో కలిసి 'ఇన్‌స్పైర్' పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఇన్‌స్పైర్ కార్యక్రమాల ద్వారా బయటకు వస్తుందన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పనిచేసే ఉన్నత పాఠశాలలు 5 నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాలలు 2 నుంచి 3 నామినేషన్లు సెప్టెంబర్ 15వ తేదీలోపు పంపాలన్నారు. ఇందుకు ఆయా పాఠశాలల సైన్సు, గణిత ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛ భారత్, ఆరోగ్య భారత్, నూతన వినూత్న ఆవిష్కరణ విభాగాల్లో నామినేషన్లు పంపాల్సి ఉంటుందన్నారు. ఎంపిక చేసిన ప్రాజెక్టులకు రూ.10 వేలు విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని జిల్లా సైన్సు అధికారి తనూజ్ కుమార్ తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి
- 15 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్
- రూ.17.10 లక్షల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాజీజాన్ సైదా

పెనుకొండ: మండల పరిధిలోని శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.17.10 లక్షలు, 5 వాహనాలు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను డీఎస్పీ బాజీజాన్ సైదా శనివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. పుట్టపర్తికి చెందిన రవి అనే వ్యక్తి శెట్టిపల్లి వద్ద పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ యుగంధర్, ఎస్‌ఐలు రాజేష్, రంగడు వారి సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. కర్ణాటక, కడప, కర్నూలు ప్రాంతాలకు చెందిన 15 మందిని అరెస్టు చేశారు. భారీగా నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు రవితో పాటు మరికొందరు అక్కడి నుంచి తప్పించుకున్నారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: వ్యాపార శక్తి సామర్థ్యాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈనెల 6 నుంచి మూడు రోజుల పాటు ఉచిత శిక్షణ ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. వివరాలకు 7981541994 నంబరులో సంప్రదించాలన్నారు.

అకృత్యం.. నిత్యకృత్యం!

- రెండు మాసాల్లో ఇద్దరు బాలికలపై అత్యాచారం
- మరో ఇద్దరు బాలికల దారుణ హత్య
- బాలికలను బడికి పంపాలంటేనే భయపడుతున్న తల్లిదండ్రులు
- వ్యక్తులపై దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలకు లెక్కే లేని వైనం
- బాధితులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని పోలీసులు
- దిగజారుతున్న శాంతిభద్రతలపై సామాన్యుల ఆందోళన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అకృత్యాలు, అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. శాంతి భద్రతలు గాల్లో దీపంలా మారాయి. పోలీసులు తమను ఏమీ చేయలేరన్న ధీమాతో దుండగులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాలు, శిలాఫలకాల విధ్వంసాలు, దాడులు, బాలికలపై అత్యాచారాలు ఎక్కడో ఒక చోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి. రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి హింసిస్తున్న ఘటనలకు లెక్కే లేకుండా పోతోంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో జరుగుతున్న దారుణాలు సామాన్యులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి.

బడికి పంపించాలంటే భయం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా బాలికలు, అభం శుభం తెలియని చిన్నారులపైనా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది జూన్ 26న పుట్లూరు మండలానికి చెందిన ఓ బాలికను ఐచర్ వాహనంలో తీసుకెళ్లి కామాంధులు అత్యాచారం చేశారు. ఒక దశలో ఫిర్యాదు ఇవ్వడానికి కూడా ఆ కుటుంబం భయపడింది. చివరకు జూలై 2న ఫిర్యాదు ఇచ్చిన తర్వాత గానీ కేసు నమోదు చేయలేదు. జూన్ 6న నార్పల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఐదేళ్ల తన కుమార్తెను దారుణంగా చంపి బావిలో పడేశారు. జిల్లావాసులను నివ్వెరపరిచిన ఈ ఘటనలు మరువకముందే ఈ నెల 2న హిందూపురం మండలం తూమకుంటలో ఏడేళ్ల చిన్నారిని వరుసకు పెదనాన్న చంపి పెన్నానదిలో పాతిపెట్టారు. ఇదే రోజు అనంతపురంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నాల్గో తరగతి బాలికపై స్కూలు కరస్పాండెంట్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటనలు జిల్లాలో క్షీణించిన శాంతిభద్రతలకు అద్దం పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో చోటుచేసుకున్న బాలిక హత్యాచార ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దారుణానికి ఒడిగట్టిన దుండగుల పట్ల కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఉదాసీనత వైఖరి ప్రదర్శిస్తుండడంతోనే అన్ని చోట్లా అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఈ క్రమంలో బాలికలను బడికి పంపించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు.

దాడులు, విధ్వంసాలకు లెక్కే లేదు

ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు నుంచి అంటే జూన్ 4వ తేదీనుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాడులకు లెక్కే లేదు. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నాయకులు హింసకు దిగుతున్నారు. హిందూపురం, శింగనమల నియోజకవర్గాల్లో ఒకరు చొప్పున హత్యకు గురయ్యారు. టీడీపీ నేతల ఒత్తిడి తట్టుకోలేక ఉరవకొండ నియోజకవర్గంలో ఒక మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురం రూరల్ మండలంలో వెలుగు యానిమేటర్ బలవన్మరణం పొందారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాల ధ్వంసం గురించి ఎంతచెప్పుకున్నా తక్కువే.

పోలీసుల ప్రేక్షకపాత్ర..

కళ్లముందే దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. పలు చోట్ల బాధితులు ఫిర్యాదులు చేస్తున్నా కేసులు నమోదు చేయడం లేదు. దీంతో ఇదే అదునుగా అసాంఘిక శక్తులు మరింతగా రెచ్చిపోతున్నాయి. రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉన్నట్టు స్థానికులు వాపోతున్నారు. కూడేరు, గార్లదిన్నె మండలాల్లో ఏటీఎంలను పగులగొట్టి డబ్బు దోచుకెళ్లిన ఘటనలూ కలకలం రేపుతున్నాయి. గ్రామాల్లో చోరీల ఘటనలు పెరిగిపోతున్నాయి.

కీచక కరస్పాండెంట్‌కు రిమాండ్

అనంతపురం: నగరంలో సంచలనం సృష్టించిన బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని రిమాండ్‌కు పంపుతూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ అదే పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన విషయం విదితమే. బాధిత చిన్నారి పిన్ని, బాబాయ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఉదయమే టూటౌన్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అర్ధరాత్రి జడ్జి ప్రతిభ ముందు నిందితుడిని హాజరు పరిచారు. ఈ క్రమంలో ఆంజనేయులు గౌడ్‌ను 14 రోజుల రిమాండ్‌కు పంపుతూ జడ్జి ఆదేశాలు జారీ చేశారు.

రావణకాష్టంలా రాప్తాడు



రామగిరి మండలం కొత్తగాదిగకుంటలో దళిత రైతులకు చెందిన భూమిని దున్నేసిన దృశ్యం (ఫైల్)

రాప్తాడు నియోజకవర్గంలో పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల విధ్వంసం సృష్టించాయి. సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ జరిగిన దారుణాల్లో మచ్చుకు కొన్ని..
- పాపిరెడ్డి పల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత జయచంద్ర రెడ్డి స్కార్పియో వాహనం ధ్వంసం
- నసనకోటలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ఏజెంట్‌గా కూర్చున్న పాపానికి మాల జగదీష్‌ను కిడ్నాప్ చేసేందుకు టీడీపీ నేతల యత్నం
- ముత్యాలంపల్లిలో ఈడిగ శివ కొట్టం కాల్చివేత. ఈ ఘటనలో ఈడిగ శివ తండ్రికి గాయాలు
- రెడ్డివారి పల్లిలో రూ. 50 వేల చోరీ. ఘటనపై పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదు
- కొత్త గాదిగకుంట గ్రామంలో దళితులైన పెద్దక్క శివయ్యల వ్యవసాయ భూమిలో నాటిన 550 చీనీ చెట్లు, అనప మొక్కల దున్నివేత. ఈ ఘటనపైనా కేసు నమోదుకు పోలీసుల నిరాకరణ.
- తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన ఓ రైతు పొలంలో బోరు మోటారు, పైపుల ధ్వంసం
- రామగిరి పంచాయతీలో పేదలకు ఇళ్ల కోసం వేసిన జగనన్న లేఅవుట్ ధ్వంసం. జర్నలిస్టుల కోసం ఇచ్చిన ప్లాట్లలో జేసీబీలతో హద్దు రాళ్లు పెకలింపు

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలి



పోస్టర్ ప్రదర్శిస్తున్న జేసీ, అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్ట పరచాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, ఐసీడీఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, వసతి గృహాల వార్డెన్లతో సమావేశమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు సమన్వయంతో పనిచేసి కార్డుదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలన్నారు. కార్డుదారుల బయోమెట్రిక్ పని చేయని పక్షంలో ఐరిష్ తీసుకోవాలని, లేకపోతే వీఆర్‌ఓ అథెంటికేషన్ ద్వారా కూడా రేషన్ ఇవ్వవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా మొదటి శుక్రవారం రేషన్ పంపిణీ చేయాలన్నారు. ప్రతి నెలా 30వ తేదీనే కేంద్రాలకు సరుకులు చేర్చాలన్నారు. వసతి గృహాలకు నాణ్యమై బియ్యం సరఫరా చేస్తామన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు..

బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన దుకాణాల ద్వారా ప్రజలకు తక్కువ ధరకే నిత్యావసరాలు అందుబాటులో ఉంచినట్లు జేసీ పేర్కొన్నారు. కందిపప్పు (దేశవాళీ రకం) కిలో ధర రూ.150, సోనామసూరి ఫైన్ రైస్ (స్టీమ్డ్) కిలో రూ.48, సోనామసూరి ఫైన్ రైస్ (ముడి) కిలో రూ.47తో అందించాలని సూచించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ అశ్వర్థ నాయక్, ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు శివరంగ ప్రసాద్, మోహన్‌రాం, నిర్మలాజ్యోతి, పలువురు డీటీలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల తొలగింపు

- కొత్తచెరువు సీహెచ్‌సీ ఎదుట బాధితుల నిరసన



విధుల నుంచి తొలగించడంతో నిరసన తెలుపుతున్న కార్మికులు

కొత్తచెరువు: స్థానిక 30 పడకల సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆరుగురు పారిశుద్ధ్య కార్మికులను ఉన్నట్టుండి శనివారం విధుల నుంచి తొలగించారు. ఏళ్లుగా పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించడంతో వారంతా నిరసనకు దిగారు.

టీడీపీ నేతల ఆదేశాలతోనే..

కొత్తచెరువు పీహెచ్‌సీలో లక్ష్మీదేవి, సాకమ్మ, పెద్దక్క, పార్వతి, సరోజమ్మ, ఈశ్వరమ్మ ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు దక్కించుకున్న చైతన్య జ్యోతి స్వచ్ఛంద సంస్థ వీరికి నెలకు రూ.11 వేల చొప్పున వేతనం ఇస్తోంది. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాల్సి ఉన్నా...ఇంతవరకూ కార్మికులకు ఆ విషయమే లేదు. కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు పారిశుద్ధ్య కార్మికులను తొలగించి టీడీపీ కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. లేకపోతే ఏజెన్సీనే రద్దు చేస్తామని బెదిరించారు. ఈ క్రమంలోనే ఏజెన్సీ నిర్వాహకులు శనివారం పారిశుద్ధ్య కార్మికులను తొలగిస్తున్నట్లు తెలిపారు. దీంతో వారంతా ఆస్పత్రి వద్ద నిరసనకు దిగారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోయినా పనిచేస్తున్నామని, కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించామన్నారు. ఉన్నట్టుండి తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. న్యాయం చేయాలని ఆస్పత్రి అధికారులను వేడుకున్నా ఎలాంటి ఫలితం లేకపోయింది. కాగా, ఆస్పత్రిలో ఉన్న ఇద్దరు వాచ్‌మెన్లను కూడా తొలగించేందుకు టీడీపీ నేతలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

టీడీపీ నేత ఇంటివద్దకు వెళ్తేనే పింఛన్

- రామగిరి మండలం గరిమేకలపల్లిలో పరిటాల సునీత బంధువు దర్పం
- పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



రామగిరి పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రామగిరి: తాము అధికారంలో ఉన్నామని, అంతా తాము చెప్పినట్లే జరగాలని టీడీపీ నేతలు ఆదేశాలిస్తున్నారు. సామాజిక పింఛన్లు కూడా తాము చెప్పిన వారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పేర్లు జాబితాలో ఉన్నా.. పింఛన్ ఇవ్వకుండా అడ్డుపడుతున్నారు. ఇక రామగిరి మండలం ఎంపీపల్లి పంచాయతీ గరిమేకలపల్లి గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత, పరిటాల సునీత బంధువు ఇంకాస్త ముందుకు వెళ్లి... తన ఇంటి వద్దే పింఛన్ పంపిణీ చేయాలని అధికారులకు హుకుం జారీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి నాగభూషణం కూడా సదరు నేత చెప్పినట్లే నడుచుకుంటున్నారు. రెండు నెలలుగా టీడీపీ నేత చెప్పిన వారికే సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్నారు. దీంతో చాలా మంది పింఛన్లు అందుకోలేకపోయారు. పంచాయతీ కార్యదర్శిని అడిగినా ఫలితం లేకుండా పోయింది. కనీసం సచివాలయంలోనైనా పింఛన్లు పంపిణీ చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో శనివారం వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, సిద్దన్న, నాయకులు నరసింహారెడ్డి, నర్సిరెడ్డి, రామ్మోహన్ తదితరులు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి నాగభూషణంపై ఫిర్యాదు చేశారు. మండలంలో తొమ్మిది పంచాయతీలుండగా, ఏడు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలిచారని, అలాగే 9 మంది ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీ వారు ఉన్నారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను ప్రభుత్వ కార్యాలయాల్లోకి కూడా అనుమతించడం లేదని, తామిచ్చిన ఫిర్యాదులు కూడా అధికారులు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

టీబీ డ్యాంకు తగ్గని వరద

బొమ్మనహాళ్: టీబీ డ్యాంలో వరద నీటి చేరిక కొనసాగుతోంది. శనివారం సాయంత్రం 1,38,394 క్యూసెక్కుల నీరు జలాశయంలో వచ్చి చేరాయి. దీంతో 33 గేట్లను ఎత్తి 1,34,888 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేశారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 98.220 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.09 అడుగులకు నీరు చేరింది.

'ఆంధ్ర' శుభారంభం

- 'అనంత'లో జాతీయస్థాయి బాలికల ఫుట్ బాల్ పోటీలు ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వినోద్‌కుమార్
- ఆంధ్రా, జార్ఖండ్ జట్ల శుభారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్



జార్ఖండ్, బిహార్ జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి 'ఫుట్‌బాల్' పోటీలు శనివారం నగరంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారిణులతో ఆర్డీటీ స్టేడియం సందడిగా మారింది. కలెక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభి, మాట్లాడారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి బాలికల విభాగం ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలు జిల్లాలో జరగడం గర్వకారణమన్నారు. ఫుట్‌బాల్ ఫెడరేషన్, ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. పోటీలను చూసి, స్ఫూర్తిని పొందేందుకు వీలుగా జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన బాలికలను పంపుతామని ప్రకటించారు.

జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ జట్ల విజయం

పోటీల్లో జార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ జట్లు శుభారంభం చేశాయి. జార్ఖండ్- బిహార్ మధ్య జరిగిన మ్యాచులో జార్ఖండ్ జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్- హిమాచల్ ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ మొత్తం 20 గోల్స్ చేయగా, హిమాచల్ ప్రదేశ్ ఒక గోల్ కూడా చేయలేకపోయింది. ఆంధ్రప్రదేశ్ తరపున టి. అరుణ 9 గోల్స్ చేసి స్కోరర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. అలాగే కెప్టెన్ ఎం. అనూష 6 గోల్స్, ఈ.సాయి వశిష్ట 3 గోల్స్, వి.నందిని, ఎం.షామీత చెరొక గోల్ చేశారు.



మ్యాచ్‌ను తిలకిస్తున్న ఈశాన్య రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు



తమ జట్టు సభ్యులను ప్రోత్సహిస్తున్న క్రీడాకారిణులు



9 గోల్స్ చేసిన క్రీడాకారిణి అరుణ

క్లుప్తంగా

ప్రాణం తీసిన క్షణికావేశం


ఆత్మహత్య చేసుకున్న దాదా ఖలందర్

ధర్మవరం అర్బన్: క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఒక నిండు ప్రాణాన్ని బలిగొంది. పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన దాదా ఖలందర్ (35) శుభకార్యాలకు డెకరేషన్ చేస్తూ వచ్చే సంపాదనతో భార్య, ఇద్దరు కుమారులను పోషించేవాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సమస్యలపై భార్య నాజియాతో గొడవపడ్డాడు. అర్ధరాత్రి తర్వాత దాదా ఖలందర్ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. శనివారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

లేపాక్షి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కల్లూరు గ్రామానికి చెందిన ప్రమీలమ్మ (28), చిన్నప్పయ్య దంపతులు. కొంతకాలంగా కుటుంబ కలహాలు మొదలయ్యాయి. శుక్రవారం ఉదయం మరోసారి దంపతులు గొడవపడ్డారు. అనంతరం భర్త పని మీద బయటకు వెళ్లాడు. సాయంత్రం వేళ ప్రమీలమ్మ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే కుటుంబ సభ్యులు కనుగొని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయినా కోలుకోలేక మృతి చెందింది. ఈమెకు భర్త, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షర్ఫుద్దీన్ శనివారం తెలిపారు.

ఆర్టీసీ మెకానిక్ ఆత్మహత్య


రైలు పట్టాలపై రామచంద్ర మృతదేహం

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ ఆర్టీసీ మెకానిక్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరానికి చెందిన రామచంద్ర (55) ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన రామచంద్ర ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. రామచంద్రకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కడుపునొప్పి తాళలేక..

కదిరి అర్బన్: మొటుకుపల్లికి చెందిన లక్ష్మమ్మ (66) కడుపునొప్పి భరించలేక శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు మధుసూదన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు.

స్నేహం.. శాశ్వతం



నేడు స్నేహితుల దినోత్సవం

స్నేహం.. ఒక అనిర్వచనీయమైన అనుబంధం. ఎల్లలులేని మమకారానికి ప్రతీక. కష్టమైనా, సుఖమైనా కలిసి పంచుకునే బంధం. నేనున్నానంటూ ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా కలుస్తూనే ఉన్నారంటే వారు కచ్చితంగా స్నేహితులై ఉంటారు. కుటుంబ సభ్యులతో చెప్పుకోని ఎన్నో ఊసులు స్నేహితుల మధ్య అరమరికలు లేకుండా అలా..అలా.. మనస్సులో నుంచి బయటకు వచ్చేస్తాయి. మంచి స్నేహితునికి మించిన వరం మరొకటి ఉండదనేది పెద్దల మాట. ఎందుకంటే అమ్మలోని ఆప్యాయత, నాన్నలోని ప్రేమ, అన్నలోని అనురాగం, అక్కలోని అభిమానం అన్నీ రంగరిస్తే కన్పించేది స్నేహం. బాలల నుంచి వృద్ధుల వరకూ మిత్రుల మధ్య దొర్లే కబుర్లే వేరు. మనసులోని అంతరంగ ఆవిష్కరణలే భిన్నం. ప్రతి నెలా ఆగస్టు మొదటి ఆదివారం రోజున స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

– బత్తలపల్లి:

మధురమైన స్నేహం



బత్తలపల్లికి చెందిన సౌధామణి, సుగుణ స్నేహితులు. ఇద్దరూ కలిసి చదువుకున్నారు. 2008లో డీఎస్సీ రాశారు. అయితే ఉద్యోగం రాలేదు. అయినా ఇద్దరూ కలిసి న్యాయ పోరాటం చేశారు. **2018 నవంబర్ 6వ తేదీన ఉద్యోగంలో** చేరారు. ఇలా తమ మధ్య ఉన్న స్నేహం కారణంగానే ఇది సాధ్యమైందని సౌధామణి, సుగుణ అంటున్నారు. ఇప్పుడు ఇద్దరూ రొళ్ల మండలంలో టీచర్లుగా పనిచేస్తున్నారు.

–సౌధామణి, సుగుణ(ఫైల్)

దోస్త్ మేరా దోస్త్..



బత్తలపల్లి పంచాయతీ పరిధిలోని వేల్పుమడుగు గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కోళ్లమొగ్రం చెన్నకృష్ణారెడ్డి, గంటాపురం గ్రామానికి చెందిన నాగభూషణ ఇరువురూ పదవ తరగతి బత్తలపల్లిలో చదువుకుంటున్నపుడు స్నేహం చిగురించింది. డిగ్రీకి చేరే సమయానికి అది చెట్టయ్యింది. ఇప్పుడు మహా వృక్షంగా ఎదిగింది. వీరిద్దరూ కలిసి మెలిసి తిరుగుతూ.. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటుంటారు. 40 ఏళ్లగా అరమరికలు లేని వీరి స్నేహం గురించి అందరూ ఆశ్చర్యంగా చర్చించుకుంటుంటారు.

– చెన్నకృష్ణారెడ్డి, నాగభూషణ(ఫైల్)

ఒకరింటికి మరొకరం..



సూర్యచంద్రాపురం కురుణామయుడు, వెంకటపతి, హరి, కాటమకుంట దివాకర్‌రెడ్డి, రాజా, డి.చెర్లోపల్లి రాము, నల్లబోయనపల్లి జయ, రాజేష్‌లు **మేమంతా చిన్న**తనం నుంచే కలిసి చదువుకున్నాం. మంచి స్నేహితులుగా ఉన్నాం. ఏడాదికోసారి అందరి ఇళ్లకు వెళతాం. మా కుటుంబాల్లోనూ ప్రతి ఒక్కరం తెలుసు. స్నేహం అనేది నిష్కల్మషంగా ఉండాలనేది మా అభిప్రాయం. ఇకపై కూడా అదే రీతిని కొనసాగిస్తాం. పాఠశాల ఎగ్గొటి కోనలోకి వెళ్లేవాళ్లం. మాలో ఇద్దరు మాత్రమే బడికి వెళ్లి ఆ రోజు జరిగిన పాఠాల గురించి వివరించేవారు. వీరిలో కొందరు ఉద్యోగం చేస్తున్నారు. కొందరు వ్యవసాయం చేసుకుంటున్నాం. ఇప్పటికీ మాస్నేహం అలాగే ఉంది.

– వేములపాటి హరినాథ్‌రెడ్డి, నల్లబోయనపల్లి, బత్తలపల్లి మండలం

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


స్నేహితులతో కలిసి ఉన్న మౌనిక(ఫైల్)

హేమ, మౌనిక, శోభ, రాజీ, సుప్రియ, గుణ, నేను (మౌనిక) అందరూ తిరుపతిలోని పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాం. వివిధ ప్రాంతాలకు చెందిన మేము ఎంతో ఉల్లాసంగా కలిసి మెలిసి ఉన్నాం. మా మధ్య భేదాభిప్రాయాలనేవి రాలేదు. ఒకవేళ వచ్చినా అది నిమిషాలపాటే. తర్వాత అందరం కలిసే ఉత్సాహంగా తిరుగుతాం. విద్యాపరంగా, ఇతర విషయాల్లోనూ మంచి సూచనలు చేసుకుంటూ వస్తున్నాం. అలా ఉండడం నిజంగా అదృష్టమే. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న మా స్నేహితులందరికీ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.

– మదనాపు మౌనిక, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బత్తలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత

అనంతపురం మెడికల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత మలేరియా యూనిట్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మలేరియా, డెంగీ ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా మునిసిపాలిటీలతో సమన్వయం చేసుకుని ఫాగింగ్, స్ప్రేయింగ్, డ్రైడే పాటించేలా సిబ్బందికి సూచలనివ్వాలన్నారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు మాట్లాడుతూ దోమకాటు నివారణ చర్యలు పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, ఉమ్మడి జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్‌ఈఓలు గిరిధర్ రెడ్డి, లక్ష్మానాయక్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లు, బదిలీలు పూర్తి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్) 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు, బదిలీలు జూలై 31తో ముగిశాయని జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 11వ తరగతి ఆర్ట్స్ గ్రూప్ (ఎంఈసీ, హెచ్‌ఈసీ, సీఈసీ) గ్రూపుల్లో మిగులు సీట్లకు అడ్మిషన్లు కోరే విద్యార్థులు నేరుగా ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను కలవాలని సూచించారు.

పరవశింపజేసిన కచేరీ


సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ తూర్పు గోదావరి సత్యసాయి భక్తులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తూర్పు గోదావరి జిల్లా సత్యసాయి భక్తులు శనివారం సత్యసాయి సన్నిధిలో ఆధాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి సన్నిధిలో సత్యసాయి చాలీసా నిర్వహించారు. సత్యసాయిని భక్తి శ్రద్ధలతో స్మరించారు. సాయంత్రం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సత్యసాయి సంగీత కళాశాల విద్యార్థులు శ్రీ సత్యసాయి గానామృతం పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

- ఏపీఆర్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు అభినందన


పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన వారితో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, పూర్వ విద్యార్థులు

పరిగి: ప్రతిభ అనేది ఏ ఒక్కరి సొత్తు కాదని, చేసే ప్రయత్నం ఆధారంగా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని వక్తలు అన్నారు. శనివారం మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో (2024 విద్యాసంవత్సరం) ప్రతిభ కనబరచిన విద్యార్థులను సన్మానించారు. పూర్వపు విద్యార్థుల (1973–76 బ్యాచ్‌లు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన మహేష్‌బాబు, యశ్వంత్, మంజునాథ్‌లకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. అలాగే 580 మార్కులు సాధించిన మరో పది మంది విద్యార్థులకు ప్రశంసాపత్రంతో పాటు రూ.8 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించారు. ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి పెరుగు సురేష్ మాట్లాడుతూ, తాను 1976 సంవత్సరంలో ఇదే పాఠశాలలో చదువుకున్నానని, ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నానన్నారు. ఇక్కడ చదువుకున్న తనలాంటి ఎందరో ఇప్పుడు వివిధ రంగాల్లో స్థిరపడి దేశవిదేశాల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటూ సంస్కారం, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి ముఖ్యమన్నారు. అప్పుడే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫక్కీరప్ప, ఆదినారాయణ, రవీంద్రరెడ్డి, శ్రీరాములు, నరసింహులు, చిన్ననాగప్ప, అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు

గొర్రెల టెంపో బోల్తా

- గొర్రెల వ్యాపారి దుర్మరణం
- 18 గొర్రెలు మృత్యువాత


మృతి చెందిన నారాయణప్ప


బోల్తా పడిన గొర్రెల టెంపో

మడకశిరరూరల్: కర్ణాటక రాష్ట్రం తుమకూరు వద్ద రాంపురం గొర్రెల సంతకు గొర్రెలను తీసుకెళ్తున్న టెంపో వాహనం శనివారం కొరటగెరె సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గొర్రెల వ్యాపారి దుర్మరణం చెందగా.. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. 18 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. మడకశిర మండలం ఎం.రంగాపురం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి నారాయణప్ప అలియాస్ జగప్ప (58) గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామాల్లో గొర్రెలను కొనుగోలు చేసి సంతలకు తరలించి విక్రయిస్తుంటారు. శనివారం ఆయనతో ఉప్పిడిపల్లి, మణూరు, రంగాపురం గ్రామాలకు చెందిన వారు బాడుగ టెంపోలో గొర్రెలను రాంపురం సంతకు బయల్దేరారు. మార్గమధ్యంలోని కొరటగెరె సమీపంలో స్టీరింగ్ కట్ కావడంతో టెంపో అదుపుతప్పి బోల్తాపడింది. గొర్రెల వ్యాపారి నారాయణప్ప అలియాస్ జగప్ప అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనతో పాటు వచ్చిన ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. 18 గొర్రెలు చనిపోయాయి. విషయం తెలుసుకుని బెంగళూరులో ఉన్న నారాయణప్ప భార్య, కుమారుడు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. కొరటగెర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు మృతుదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

కాయిన్‌బాక్స్ పేరిట మోసం

కదిరి అర్బన్: సైబర్ నేరస్తులు రెచ్చిపోతున్నారు. రోజుకో పేరుతో మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కదిరి మండలం బోడేనాయక్‌తండాకు చెందిన బాబ్జీనాయక్ మొబైల్‌కు గత నెల 16న అపరిచిత వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. ఏ1 ఎంటర్ ప్రైజెస్ అనే సంస్థ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి.. రూ.15వేలు విలువ చేసే టెలిఫోన్ కాయిన్ బాక్సును ఆఫర్‌లో రూ.8వేలకు ఇస్తున్నామని చెప్పారు. తాను చెప్పిన నంబర్‌కు ఫోన్‌పే చేస్తే కాయిన్ బాక్స్ పంపుతామని చెప్పడంతో బాబ్జీనాయక్ డబ్బు పే చేశాడు. ఆ తర్వాత నుంచి సదరు నంబర్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ అని వస్తోంది. తనను మోసం చేశారని గ్రహించిన బాబ్జీనాయక్ శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

కదిరి టౌన్: మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు తక్షణమే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుటాగుళ్ల, వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూళ్లు, కుటాగుళ్ల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, మశానం పేట, జౌకుపాళ్యం పాఠశాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ నూతన సర్వీసు నిబంధనల ప్రకారం బదిలీలు, ప్రమోషన్లు తక్షణమే నిర్వహించాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అన్ని పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, మున్సిపల్ టీచర్లకు పీఎఫ్ సౌకర్యం వెంటనే కల్పించాలని, బోధనేతర సిబ్బందిని నియమించాలన్నారు. 117 జీవో రద్దు చేయాలని, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, తల్లికి వందనం ప్రభుత్వ బడి పిల్లలకు మాత్రమే ఇవ్వాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, అదనపు కార్యదర్శి ఆసిఫ్, ఎస్టీయూ కదిరి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవినాయక్, శంకర్‌నాయక్, వీర మహేశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం


పీఏబీఆర్‌లో చేరుతున్న తుంగభద్ర జలాలు

కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌కు చేరుతున్నట్లు డ్యాం ఇరిగేషన్ డీఈ శశిరేఖ తెలిపారు. శనివారం డ్యాం నీటి మట్టాన్ని పరిశీలించారు. 0.605 టీఎంసీల నీరు ఉన్నట్లు పేర్కొన్నారు. తుంగభద్ర జలాలను విడుదల చేయక ముందు 0.442 టీఎంసీలు నీరు ఉండేవన్నారు. డ్యాం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి, అనంత, శ్రీరామరెడ్డి, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 55 నుంచి 65 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఆమెతో పాటు జేఈఈలు లక్ష్మీదేవి, ఫాతిమా తదితరులు ఉన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సిమ్ ఉచితంగా అప్‌గ్రేడేషన్

అనంతపురం సిటీ: పాన్ ఇండియా ఆధారంగా బీఎస్‌ఎన్‌ఎల్ (భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్) 4జీ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు ఆ శాఖ ఉమ్మడి జిల్లా జనరల్ మేనేజర్ షేక్ ముజీబ్ పాషా శనివారం తెలిపారు. అయినా చాలామంది బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు ఇప్పటికీ 2జీ, 3జీ సిమ్‌లు మాత్రమే ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి 4జీ సేవల్లో అంతరాయం ఏర్పడుతుందని గుర్తు చేశారు. 2జీ, 3జీ సిమ్‌లు ఉపయోగిస్తున్న వారి కోసం ప్రత్యేకంగా 4జీ అప్‌గ్రేడేషన్ ఉచిత ప్రక్రియను ప్రారంభించామని వెల్లడించారు.

బావిలోకి జారిపడి వృద్ధురాలు మృతి

లేపాక్షి: ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన తనయుడిని వెతుక్కుంటూ వెళ్లిన తల్లి అదుపుతప్పి బావిలో పడటంతో ప్రాణం కోల్పోయింది. ఏఎస్ఐ షర్ఫుద్దీన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచిసముద్రం గ్రామానికి చెందిన ముక్కనరసమ్మ (68) కుమారుడు, కోడలితో కలిసి ఉంటోంది. రెండు రోజుల కిందట కొడుకు, కోడలు కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. మనస్తాపంతో అలిగి ఇంటి నుంచి కుమారుడు వెళ్లిపోయాడు. ఒక్కగానొక్క కొడుకును వెతికి నచ్చజెప్పి ఇంటికి తీసుకొద్దామని ముక్కనరసమ్మ బయల్దేరింది. అలా వెళ్లిన తల్లి, కుమారుడు తిరిగి రాలేదు. శనివారం ఉదయం గ్రామ సమీపంలోని పొలం వద్ద బావిలో ముక్కనరసమ్మ శవం స్థానికులకు కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని బయటకు తీయించారు. పచ్చిక నడుమ బావి ఉందన్న విషయం తెలియక కొడుకును వెతికే ఆత్రుతలో అదుపుతప్పి బావిలో పడి ఉండటంతో ప్రాణం కోల్పోయి ఉండొచ్చని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

రైతుల నడ్డి విరుస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని సీపీఐ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం పుట్టపర్తిలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసి, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, మహదేవ్, మధు, దాదాపీర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనంతసాగరంలో పట్టపగలే చోరీ

బత్తలపల్లి: అనంతసాగరం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొండమ్మ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శనివారం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లింది. మధ్యాహ్నం వేళ దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి దొరికినవి పట్టుకెళ్లారు. కూలి పనులు ముగించుకుని వచ్చిన కొండమ్మ.. ఇంటి తలుపులు తెరిచి ఉండడం చూసి లోనికెళ్లి పరిశీలించింది. బీరువాలోని మూడు తులాల బంగారు తాళిబొట్టు చైన్, 4తులాల దండ, ఒక జత కమ్మలు, వెండి గొలుసులతో పాటు రూ.50 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి


మృతుడు సుశీల్ చ్యూబే

పరిగి: మోదా వద్ద ఉన్న మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుశీల్ చ్యూబే(30) సోదరుడు మోదా వద్ద ఉన్న మహర్షి ఐరన్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇటీవల సోదరుడిని చూసేందుకు వచ్చిన సుశీల్ చ్యూబే ఫ్యాక్టరీలోనే పనికి కుదిరాడు. ఈ క్రమంలో శనివారం ఫ్యాక్టరీలో పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫ్యాక్టరీ యాజమాన్యం సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పరిగి పోలీసులు... ప్రమాదంపై ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.